కేంద్రమంత్రులకు శుభాకాంక్షల వెల్లువ



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న రవిప్రసాద్‌గౌడ్



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో...



బండి సంజయ్‌తో మర్రి శశిధర్‌రెడ్డి

బౌద్ధనగర్: కేంద్రమంత్రిగా మరోసారి ప్రమాణస్వీకారం చేసిన సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డిని బౌద్ధనగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం న్యూఢిల్లీలోని శాస్త్రిభవన్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసిన రవిప్రసాద్ శాలువాతో సన్మానించి అభినందించారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ మేయర్ కార్తీకచంద్రారెడ్డి

సనత్‌నగర్: రాష్ట్రం నుంచి కేంద్రమంత్రులుగా నియమితులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అభినందించారు. ఢిల్లీలోని ఆయా మంత్రుల కార్యాలయాల్లో వారిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

లాలాపేట: కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రిగా గురువారం ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డిని నగర మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రంలో మూడోసారి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కొలువుదీరిన కేంద్రమంత్రి వర్గంలో కిషన్‌రెడ్డికి రెండోసారి కేంద్రమంత్రిగా అవకాశం దక్కడంపై కార్తీకరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. ఆయనను ఘనంగా సన్మానించారు. బీజేపీ నేతలు బండ చంద్రారెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకులు కొల్లి నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

ఢిల్లీ వెళ్లిన స్థానిక నేతలు..

చిలకలగూడ: కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రిగా గంగాపురం కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయమంత్రిగా బండి సంజయ్‌లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, కన్వీనర్ హరి, అధికార ప్రతినిధి ప్రభుగుప్తా, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, శ్యామ్‌సుందర్, రాజేశ్వరరావు, సాయిదత్తు తదితరులు మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా..

ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ డెబస్మిత



డెబస్మిత బెనర్జీ

అడ్డగుట్ట: బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో అరికట్టడానికి నిరంతరం శ్రమిస్తున్నామని ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లు, ఇతర రైల్వే ప్రాంగణాల్లో బచ్‌పన్ బచావో ఆందోళన్, జీఆర్పీ పోలీసులతో కలిసి ఆర్పీఎఫ్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బాల కార్మికుల నిర్మూలనకై తాము నిరంతరం శ్రమిస్తున్నామని, పిల్లలు తమ ఉజ్వల భవిష్యత్తును కాపాడేందుకు కౌన్సెలింగ్‌లు నిర్వహించిన హోమ్‌లకు తరలిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 'ఆపరేషన్ నన్హే ఫరిష్టే' లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లు, రైళ్లలో 146 మంది పిల్లలను రెస్క్యూ చేసి చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. 'ఆపరేషన్ అగెన్స్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్'లో 103 మంది పిల్లలను కాపాడి, 44 మంది ట్రాఫికర్స్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. బాల కార్మిక నిర్మూలనతో పాటు హ్యూమన్ ట్రాఫికింగ్‌ను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఆర్పీఎఫ్ పోలీసులు నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు.

రెండేళ్లు నిండితే అంగన్‌వాడీల్లో చేర్పించాలి



తుకారాంగేట్‌లో చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: రెండేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ శోభ రాణి సూచించారు. గురువారం తుకారాంగేట్ వడ్డెరబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం, యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ఆమె ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండేళ్లు పైబడిన చిన్నారులను స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత ఒకటోతరగతిలో చేర్పించాలన్నారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ సభ్యురాలు సుమతి తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలని..

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌కు వినతి



జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకారం అందించాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అమ్రపాలిని గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో అంతర్గత రహదారుల ఏర్పాటుకు టెండరు ప్రక్రియ చేపట్టగా.. పార్లమెంట్ ఎన్నికల ముందు టెండర్లను రద్దు చేశారని, ఆయా పనులకు రీ టెండరింగ్ చేసి నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. మహ్మద్‌గూడ, బ్రాహ్మణబస్తీ, శ్రీనివాసనగర్, ఫ్రైడేమార్కెట్, జోషికాంపౌండ్, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయని, ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలన్నారు. పదవీ విరమణ చేసిన పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో నూతన రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని, బక్రీద్ సందర్భంగా వ్యర్థాలను తరలించేందుకు గార్బేజ్ బ్యాగులు, వాహనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారని కార్పొరేటర్ వివరించారు.

తలసాని శంకర్‌యాదవ్‌కు నివాళి



లాలాపేట: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు తలసాని శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద వెస్ట్‌మారెడుపల్లిలో గురువారం తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తుదారుల సంఘం నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలసానిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు రమేష్‌యాదవ్, మధుయాదవ్, కొమురయ్యయాదవ్, రాజేందర్‌యాదవ్, విష్ణుయాదవ్, రమేష్‌యాదవ్ తదితరులున్నారు.

ఆక్రమణలతో బేజార్!



కేఎల్‌ఎన్ పార్కు రహదారిలో పార్క్ చేసిన వాహనాలు

- కుంచించుకుపోతున్న రహదారులు
- ఓ వైపు అక్రమ పార్కింగ్
- మరో వైపు వ్యర్థాలు డంప్ చేస్తున్న వైనం

సనత్‌నగర్: ఆ రోడ్డు ఎన్నో కాలనీలకు రాచబాట. అసలే రహదారి విస్తరణ అంతంత మాత్రమే. అయినా హైవేకు దగ్గరి రోడ్డు కావడంతో ప్రజలు ఈ మార్గాన్నే అనుసరిస్తుంటారు. ఇలాంటిది ఇప్పుడు ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఇష్టానుసారంగా రోడ్డును ఆక్రమించడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ (కేఎల్‌ఎన్‌వై) పార్కు, ఈఎస్‌ఐ మెడికల్ డిపోల మధ్య రహదారిలో ఈ పరిస్థితి నెలకొంది.

◆ సనత్‌నగర్ పరిసర ప్రాంత కాలనీలకు ఎర్రగడ్డ ప్రధాన రహదారిని ఈ రోడ్డు అనుసంధానం చేస్తోంది. సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీకాలనీ, తులసీనగర్, రవీంద్రనగర్‌కాలనీ, ఉదయ్‌నగర్, బీకేగూడ రోడ్డు, బల్కంపేట తదితర ప్రాంతాల నివాసితులు ఎర్రగడ్డ వైపు రావాలంటే ఎక్కువగా ఈ రోడ్డును ఉపయోగిస్తుంటారు.

◆ కేఎల్‌ఎన్ పార్కు గోడను ఆనుకుని స్వచ్ఛ ఆటో ట్రాలీలను వరుసగా పార్కు చేస్తున్నారు. దీనికి తోడు ఈఎస్‌ఐకు వచ్చే పలు వాహనాలను తరచూ ఈ రోడ్డులోనే పార్క్ చేస్తుంటారు.

◆ ఉదయం పారిశుద్ధ్య సిబ్బంది తొలగించిన రెండు గంటల్లోనే చెత్త పేరుకుపోతోంది. ఒక్కరోజు చెత్త తొలగించకపోయిన సమీప రవీంద్రనగర్‌కాలనీ నివాసితులతో పాటు ఆ రోడ్డు రాకపోకలు సాగించే వారు దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



రహదారి పక్కన పారవేసిన చెత్తా చెదారం, చెట్ల కొమ్మలు ఇలా..

పేరుకుపోయిన చెట్ల కొమ్మలు..

చెట్ల కొమ్మల వ్యర్థాలు పేరుకుపోయి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ రహదారిలో ఈ రకమైన పరిస్థితులున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

◆ ఈఎస్‌ఐ డిపో నుంచి నిర్మాణ వ్యర్థాలను కూడా ఇక్కడే డంప్ చేసి వదిలేశారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు భారిన పడే ప్రమాదం ఉందని స్థానిక కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రికి రాత్రే డబ్బా ఏర్పాటు..

ఇక రాత్రికి రాత్రే డబ్బాను ఏర్పాటుచేయడంతో మరిన్ని ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అక్రమ పార్కింగ్‌తో పాటు చెత్త డంపింగ్‌ను నివారించాలని సమీప కాలనీల ప్రజలు కోరుతున్నారు.

బయటి వ్యక్తులు వ్యర్థాలను పారేస్తున్నారు..

"ఈ రహదారి నుంచి వస్తే ముందుగా రవీందర్‌నగర్ కాలనీయే ఉంటుంది. డిపో ప్రహరీ పక్కన నుంచి వ్యర్థాలను పారవేసి వెళ్లిపోతున్నారు. తమ కాలనీవాసులు స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇస్తారు. బయట వ్యక్తులు ఆ మార్గంలో వెళ్తూ.. వ్యర్థాలను పారేయడంతో తాము దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యతో పాటు అక్రమ పార్కింగ్‌పై కూడా దృష్టి సారించాలి."

- విజయ్‌సింగ్, రవీందర్‌నగర్ కాలనీ అధ్యక్షుడు

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.41, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 61, పచ్చకాకర 45, పందిరి బీర 65, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండకాయ 26, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 25, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-5గా ఉన్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దరఖాస్తులకు ఆహ్వానం

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ దేవాలయంలో ఆషాడ బోనాలజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసేందుకు దేవాదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఉత్సాహవంతులైన భక్తులు, ఆధ్యాత్మికవేత్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి మహేందర్‌గౌడ్ తెలిపారు. ఈనెల 14న ఉదయం 10 గంటలలోపు ఆలయ ప్రాంగణంలో దరఖాస్తులను పూర్తి వివరాలతో అందజేయాలన్నారు.

బిల్లు చెల్లించాలంటే.. ఉక్కపోత భరించాల్సిందే !

లాలాపేట: తార్నాకలో లాలాగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న బిల్ కౌంటర్ వద్దకు వచ్చే వినియోగదారులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లు చెల్లించేందుకు వచ్చిన వారు క్యూలో నిల్చోలేకపోతున్నారు. కనీసం ఫ్యాన్ లేకపోవడంతో ఉక్కపోతతో సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి ఫ్యాన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

సనత్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధి లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంగోపాల్‌పేట చుట్టలబస్తీకి చెందిన సాయిరాం (38) టిఫిన్ సెంటర్ నిర్వహిస్తుంటాడు. మద్యానికి బానిసైన అతడు గత నెల 28న రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో రాత్రి 11 గంటల సమయంలో భార్య ఉష ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో పలుచోట్ల ఆచూకీ కోసం వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాసవీ కమిటీ సభ్యుల సన్మానం

కంటోన్మెంట్: ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీగణేశ్‌ను ఐదోవార్డు న్యూ వాసవీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని, ఎల్లవేళలా ప్రజాసేవకు అందుబాటులో ఉంటానన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినయ్, వైస్ ప్రెసిడెంట్లు రాములు, శశి, కిషన్, కాంగ్రెస్ నేతలు సతీష్ గుప్తా, రేపల్లె వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి

లాలాపేట: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు లబ్ధిదారులకు అందించేందుకు నాయకులు కృషి చేయాలని సికింద్రాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ అన్నారు. ఈ మేరకు గురువారం లాలాపేట్‌లో టీపీసీసీ కార్యదర్శి జీడీ అమర్‌నాథ్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకం క్రింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు విద్యుత్ అధికారులు కృతనిశ్చయంతో పనిచేయాలని కోరారు. తార్నాక, లాలాపేట కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఓయూ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) దేవిదాస్ జైజర్ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా గురువారం క్యాంపస్‌లోని పీజీ విద్యార్థుల సి - హాస్టల్ మరమ్మతుల్లో భాగంగా నూతన రేకులకు రంధ్రాలు పెద్దగా ఉండటంతో అవికాస్తా.. వర్షానికి ఉరవడంతో కమిటీ రిపోర్టు ఆధారంగా ఏఈ, డీఈ, ఈఈలకు బదులు గతేడాది మార్చి 31న నిబంధనలకు విరుద్ధంగా మాజీ వీసీ ప్రొ.రవీందర్ తనను సస్పెండ్ చేశారని వివరించారు.

సస్పెండైన 15 నెలల నుంచి 75 శాతం వేతనాన్ని చెల్లిస్తున్నారని ఎంతో కాలంగా యూనివర్సిటీకి సేవలందిస్తున్న తనను సస్పెండ్ చేసి ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెన్షన్‌ను పునఃపరిశీలించి ఎత్తివేయాలని ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌కు విజ్ఞప్తి చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఎఫ్‌టీఎల్ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌కు ఆనుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ స్థలంలో వెలసిన ఆక్రమణలను గురువారం నేలమట్టం చేశారు. ఇక్కడి సర్వేనెంబర్ 194/8/1లోని 10.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎఫ్‌టీఎల్ స్థలంలో కొంతమంది అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో మాతాజీనగర్ నివాసితులతో పాటు బీజేపీ సీనియర్ నేత నెమలి ఆనంద్‌ల నేతృత్వంలో ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కలెక్టర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. దీంతో అధికార యంత్రాంగం కదిలింది.

భారీ పోలీస్ బందోబస్తుతో..

నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో భారీగా పోలీసు సిబ్బంది మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జేసీబీల సాయంతో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, బాలానగర్ రెవెన్యూ సిబ్బంది తరలివచ్చి ఈ కూల్చివేతలను చేపట్టారు. ఇక్కడ వెలసిన దాదాపు అన్ని నిర్మాణాలను కూల్చివేయగా.. కోర్టు స్టే ఆర్డర్ ఉన్న రెండు నిర్మాణాల జోలికి వెళ్లలేదు. ఈ నిర్మాణాలు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు శ్రీదేవి, గాయత్రిల పర్యవేక్షణలో కూల్చివేతలు చేపట్టారు. సదరు స్థలంలో కూల్చివేతల అనంతరం తిరిగి నిర్మాణాలు చేపట్టడంతో 4-5 సార్లు కూల్చివేతలు జరగడం గమనార్హం.

అభినందన..

బేగంపేట మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ఆక్రమణలను కూల్చివేయించి కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని కాపాడారంటూ బీజేపీ నేత నెమలి ఆనంద్‌ను ఆ పార్టీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు అభినందించారు. మాతాజీనగర్ నివాసితులకు అండగా నిలబడి వారితో కలిసి పోరాడిన తీరు అద్భుతమని కొనియాడారు. ఆకుల మహేష్, మధుసూదన్, దయానంద్ ఉన్నారు.

తగిన చర్యలు తీసుకోవాలి..

"కూల్చివేతలు జరిగిన ప్రాంతంలో ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సదరు స్థలాన్ని ప్రజాప్రయోజనాల కోసం కేటాయించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమార్కుల ఆగడాలను అరికట్టి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి."

- నెమలి ఆనంద్, బీజేపీ నేత



రెజిమెంటల్‌బజార్‌లో..

భారీ వర్షం.. జలమయమైన లోతట్టు ప్రాంతాలు

సనత్‌నగర్: భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. రహదారులపై భారీగా చేరిన వరదనీటిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గురువారం మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల వరకు వర్షం కురవడంతో పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకొచ్చే సమయం కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులు నరకయాతన పడ్డారు. రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్లలో వర్షం ధాటికి రోడ్లు నదులను తలపించాయి. ప్రధాన, అంతర్గత రహదారులపై వరదనీరు చేరడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు.



సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ ప్రాంతంలో..

ప్రారంభమైన ఫెర్మెంటేషన్ టెక్నాలజీ సర్టిఫికెట్ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఫెర్మెంటేషన్ టెక్నాలజీ సర్టిఫికెట్ కోర్సులో మూడ్రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓయూ క్యాంపస్ సీఎఫ్‌ఆర్‌డీ భవనంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ నవనీతరావు ప్రారంభించి మాట్లాడారు. గత విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీలో ఫెర్మెంటేషన్ (పులియ పెట్టడం) కోర్సును ప్రవేశపెట్టాలని ఓయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య వివరించారు. పులియపెట్టడం సాంకేతిక పరిజ్ఞానం పారిశ్రామిక స్థాయి, భాగాలు పద్ధతులను అర్థం చేసుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. డా.సౌరిష్ భట్టాచార్య, మాడపాటి శ్రీనాథ్, రంజిత్‌కుమార్, షాలిని, హమీదా బి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ హాస్టల్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హాస్టల్స్‌లో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్‌ఎల్. పద్మ డిమాండ్ చేశారు. గురువారం ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో లేడీస్ హాస్టల్‌లో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ విధానాన్ని రద్దుచేసి హాస్టల్స్, భోజనశాలల ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, వేతనాలను పెంచాలని ఎస్‌ఎల్ పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈశ్వర్, లక్ష్మి, వెంకటేష్, విజయ, అనిత, పద్మ, జయ, లలిత, శాంత, శ్యామల పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: నగరంలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ అయిన బోయిన్‌పల్లి మార్కెట్ యార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు కమిషన్ ఏజెంట్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిషన్ ఏజెంట్‌లు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యార్డులోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రతి దుకాణానికి తాగునీరు,టాయిలెట్స్ తదితర కనీస సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీలో విలీనమైతే యార్డును మరింత వేగంగా అభివృద్ధి చేయొచ్చన్నారు. కమిషన్ ఏజెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు మిర్యాల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనంద్ బాబు, యాదగిరి, బల్వంత్, కృష్ణారెడ్డి, సాంసన్, రైమండ్, నరేష్, సంతోష్‌యాదవ్, బిక్షపతి, విష్ణు, వెంకటేష్, శరత్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు భ్రమల్లో ఉన్నారు..

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ నేతలు ఇంకా తామే అధికారంలో ఉన్నామనే భ్రమల్లో ఉన్నారని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఐదోవార్డు సంజీవయ్య నగర్‌లో ప్రభుత్వ నిధులతో మంజూరైన బోర్‌వెల్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన నిధులతో చేపట్టే పనుల్లో బీఆర్‌ఎస్ నేతలు అనవసరంగా జోక్యం చేసుకుంటూ అభాసు పాలవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో ప్రజా సమస్యలపై దృష్టి సారించి తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామంటూ హితవు పలికారు. కాంగ్రెస్ నేతలు సంకి రవీందర్, శ్యామ్‌రెడ్డి, నగేష్‌యాదవ్, భాస్కర్‌గౌడ్, విక్కీ, సాయి, సంతోష్ యాదవ్, సందీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.